
# అల-అబల



చక్కటి వాతావరణం, అందమైన సముద్రతీరం దాని పొడుగునా కొబ్బరిచెట్లు, అక్కడక్కడా పూరి గుడిసెలు. ఎటు చూచినా అందం, ఆనందం. గుంపులు, గుంపులుగా జనం ఇసుకలో కూర్చుని హాయి అనుభవిస్తున్నారు. చిన్న పిల్లలు ఆటలో ఒక భాగంగా ఆలిచిప్పలకోసం వెతుకుతున్నారు. ఒకళ్ళ మీద ఒకళ్ళు ఇసుక జల్లుకుంటూ ఆడుకుంటున్నారు. కొత్త జంటలు చెట్టాపట్టా లేసుకొని సరదాగా అలలతో పోటీగా పరుగులు తీస్తున్నారు.

ఉషారాణి మాత్రం ఆ సాయంత్రం హాయి అనుభవించలేక పోతున్నది. ఆమె మామూలుగా వచ్చి కూర్చునే చోటనే కూర్చున్నది. ఆమె ఆలోచనలకు అంతు లేదు. ఏదో నిరీక్షణ. ఎందుకో తెలియదు. అయినా, అలా సముద్రతీరంకేసి చూస్తూనే ఉన్నది. నీలి నీటిమీద నల్లని తెప్ప కంటిలో నలుసులా దూరంగా కనిపిస్తున్నది.

ఉషారాణి ముఖంలో చిరునవ్వు.

భిల్లుతాత, రామయ్యలదే ఆ తెప్ప. ఆమె ఎంతో ఆనందించింది. కటిక దరిద్రులు, అతి సామాన్యులు వాళ్ళు. కానీ, వాళ్ళ ఆదరణ, ఆప్యాయత, ప్రేమ ఉషారాణిని పూర్తిగా ఆకర్షించాయి. వాళ్ళ స్నేహం వల్లనే ఇంటి విషయాలు మరిచి పోయి, హాయిగా నవ్వగలుగుతూంది. ఆమె ఆలోచనలు ఇంటి వైపు మళ్ళాయి.

తల్లి, తండ్రి ఫారిన్‌లో ఉండి వచ్చారు. ఆ ఇంట్లో అన్నీ ఉండి కూడా లేనట్లే లెక్క. ఎవరి ఇష్టం వారిది. ఎప్పుడూ పార్టీలు, డిన్నర్లు, త్రాగుడు. అందరికీ విదేశీయ వ్యామోహం కలిగిన కుటుంబం అయినా, ఆమె ఒంటెద్దు జీవితం గడుపుతూంది.

ఇంట్లో వంట పని మొదలు అంట్ల పని వరకు ఆమె సాయం కావాలి. కాని, ఆమె పెండ్లి విషయం ఇంట్లో ఎవరికీ పట్టలేదు. ఆమె ఆ ఇంట్లో జీతం లేని పనిమనిషి.

చదువు పూర్తి అయ్యాక ఒంటరిగా బీచికి వెళ్ళటం, టైము ఉన్నప్పుడు మాత్రం వెల్‌ఫేర్ హోముకు వెళ్ళి చేతనయిన సాయం చేయటం ఆమె కలవాటు.

రెండేళ్ళ క్రితం భిల్లుతాత, రామయ్యల పరిచయం ఆమె కనుకోకుండా కలిగింది. ఆమెకు ఆప్తమిత్రులు వాళ్ళు. భిల్లుతాత, రామయ్యలకు ఉషారాణి ఏదో తెలియని అనుబంధం.

● ● ●

రెండేళ్ళ క్రితం —

ఉషారాణి బి. ఎ. ఫస్టు క్లాసులో పాసయింది. ఆ నాడు స్నేహితులకు స్వీట్స్ పంచిపెట్టింది. ఇంట్లో స్వయంగా ప్రత్యేకమయిన వంటలతో భోజనాలు తయారుచేసింది. కుటుంబ సభ్యులు ఒక్కరూ తనతో సహకరించలేదు. తన సంతోషాన్ని పంచుకోలేదు. అందుకే కసిగా ఆ వంటలు వెల్‌ఫేర్ హోంలోని చిన్నపిల్లలకి పంపి, తృప్తిపడింది. విసుగుతో, కోపంగా బీచికి బయలుదేరి, నీటికి దగ్గర్లో కూర్చుంది. జాలరుల గుడిసెల్లో నుంచి ఎవరిదో మూలుగు. సహజమైన ఆమె దయార్ద్రహృదయం విషయం తెలుసుకోవటానికి తాపత్రయ పడింది. అందుకే ఆమె గుడిసె దగ్గరకు వెళ్ళి తొంగిచూసింది. ఓ ముసలాడు ఓ మూల ముడుచుకుని పడుకొని ఎంతో బాధపడుతున్నాడు. ధైర్యంచేసి ఆ వసకంలోకి అడుగు పెట్టింది.

"రామయ్యా, వచ్చావా?" అంటూ లేవబోయి పడిపోయా డతను.

తటపటాయిస్తూనే గబుక్కు పట్టుకొని, "తాతా, ఎందుకు మూలు తున్నావు?" అంది ఆమె.

మెల్లిగా కళ్ళు తెరిచి, "..

తల్లీ. నిన్నటాం మంచి మా రామయ్య లేడు'' అన్నాడు.

''రామయ్య ఎవరు, తాతా?''

''నా మనుమడే నమ్మా? ఏటి కెళ్ళిండు. ఇంకా రాలే నాకు ఓపిక లేదు సాయం పోవటానికి.'' అంటూ ఏదో తప్పు చేసినట్లుగా— ''తల్లీ, పెద్దోరు, తమరు మా గుడిసెలో...తప్పు, తల్లీ, తప్పు'' అన్నాడు ఎంతో బాధగా.

''ఫర్వాలేదు, పడుకో, తాతా.''

వెంటనే ఉష గుడిసె బయటకు వచ్చింది. దూరంగా టీ బకెట్‌తో వెళ్ళి పోతున్న కుర్రాడిని పిలిచింది, లోపలకు వెళ్ళి కుర్రాడి సాయంతో తాతను లేపింది.

''తాతా, వేడి టీ తాగు, తల నొప్పి కొంచెమయినా తగ్గుతుంది.''

వేడి టీ చప్పరిస్తున్న ఆ ముసలి తాతకు ఎందుకో కన్నీళ్ళు వచ్చాయి. అతను జాలిగా ఆమె వైపు చూశాడు.

''అమ్మా, మా తల్లీ, నీది ఎంత దొడ్డ మనసు, తల్లీ'' అంటూ ఆత్రంగా టీ తాగేసి, మళ్ళీ చింకి చాప మీదకు ఒరిగిపోయాడు.

కుర్రాడికి డబ్బు ఇచ్చి ఒక్కసారి గుడిసెను పరికించింది ఉషారాణి. చిన్న చిన్న మట్టిపాత్రలు, వాటి పక్కగా మంచినీళ్ళ కుండ, ఒక పత్తు గ్లాసు, దండెం మీద వేలాడుతున్న రెండు




చింకి పంచెలు, ఒక విరిగిపోయిన వల మాత్రం ఉన్నాయి. ఆ గుడిసెలో దరిద్ర నారాయణుడు దయతో రాజ్యం చేస్తున్నాడు.

ఇంతలో ఎవరో యువకుడు రొప్పుకుంటూ లోపలికి రాబోయి, గొప్పింటి అమ్మాయిని గుడిసెలో చూసి ఆగిపోయాడు. కండలు తిరిగిన శరీరం, చామనచాయ, చక్కని ముఖం, వయస్సు పాతికేళ్ళు, ఆమె ఒక్క నిమిషం కన్నార్పకుండా చూసింది. పల్లె వాళ్ళలో కూడా ఇంత అందమయిన మగవాళ్ళు ఉంటారా? ఆమె ఆలోచనలు ఎటో తేలిపోయాయి.

"నీ పేరేనా రామయ్యా?" ప్రశ్నించింది.

"కానండి, ఆయనే మా తాత" అన్నాడు నిద్రపోతున్న భిల్లుని చూపిస్తూ. "రెన్నాళ్ళ మంచి తల నొప్పి అంటే మందు ఇప్పిద్దామని ఎటు కెళ్ళినా ఈ రోజు కూడా ఏం దొరకలే, మందు ..."

'పాపం' అనిపించింది దానికి. "నా వెంటరా అక్కడ ఉన్న షాపు దగ్గర మందు ఇప్పిస్తా. మరేం భయంలేదు మీ తాతకు. మందు వేసుకొని పడుకుంటే అదే తగ్గిపోతుంది." బయటకు వచ్చింది ఉషారాణి.




• • •

ఉషారాణి రోజూ భిల్లు, తాత, రామయ్యలను కలుసుకోవడం మామూలు అయింది. సముద్రం, వేట వేసిన గూర్చిన వింతలు, విశేషాలు వాళ్ళు ఉషారాణికి కథలుగా చెబుతుండేవారు. ఆమె అక్కడికి రాని నాడు వారికి ఏదో పోగొట్టుకున్నట్లుగా ఉండేది.

ఆ వేళ ఉషారాణి బీచికి వచ్చింది. గుడిసె ఖాళీగా ఉండటంతో వాళ్ళకోసం సముద్రంకేసి చూస్తూ కూర్చున్నది. దూరంగా తెప్ప కనిపించింది. అలల ఉయ్యాలలో ఊగుతూ సాయంత్రపు సూర్యకిరణాలు పడ్డ సముద్రం మీద మెరుస్తున్నాయి. మెరుపుల మధ్య తెప్ప కదిలి వస్తున్నది.

ఏదో ఆలోచిస్తూ యథాలాపంగా పక్కకు చూసిన ఉషారాణి విస్తుపోయింది. అందంగా, ఆకర్షణీయంగా ఉన్న ఒక యువకుడు తదేకంగా తననే చూస్తున్నాడు. సభ్యత లేకుండా అలా చూస్తున్న అతణ్ణి చూసి ముఖం పక్కకు తిప్పుకుంది. మెల్లగా ముందుకు వచ్చి, "ఎక్స్‌క్యూజ్ మీ" అన్నాడా వ్యక్తి.

అతనివైపు విస్మితంగా చూసింది ఉషారాణి.

"మీరు కామేశ్వరరావుగారి అమ్మాయి కదూ?"

"ఆఁ... అవును." సముద్రం మీద తేలి వస్తున్న తెప్పకేసి చూస్తూ, "మీ కెలా తెలుసు?" అని అడిగింది.

"మీ అమ్మగారు నాకు దూరపు బంధువు. నేను మొన్నటి వరకు స్టేట్స్‌లో ఉండటంవల్ల మిమ్మల్ని ఎవర్నీ కలుసుకోలేకపోయాను. అయినా, ఈ మద్రాస్ పట్నంలో ఎవరికి వారే యమునాతీరే! ఏ మై కరెక్ట్?" అన్నాడు అతను.

ఇద్దరూ కూర్చుని కబుర్లలో పడ్డారు. తన గురించి వివరాలు అడుగుతుందేమో అనుకున్నాడు రఘురాం. కాని, ఆమె అడగలేదు. ఆమె మంచితనం, అందచందాలు అతణ్ణి ఎంతో ఆకర్షించాయి. ఏదో అడగబోయాడతను. కాని, దూరంగా తెప్ప దిగిన రామయ్య ఎంతో ఉత్సాహంగా పరుగెత్తుకొస్తున్నాడు. ఉషారాణి అతనికెదురు వెళ్ళింది, అది చూసి ఆశ్చర్యపోయాడు రఘురాం.

"ఉషమ్మగారూ, ఇయ్యాల పట్టిన ఈ సేపలు మీకోసం. నాయాల్డి ఎన్ని రోజుల నుంచి సూస్తుండ— దొరకందే" అంటూ మొలకు వేలాడుతున్న సంచిలో నుంచి ఒక సీసా పైకి తీశాడు. ఒకే సారి అయిదారు రంగులు కనిపించే రంగు చేపలు రెండు ఉన్నాయి అందులో. వెనక వస్తున్న భిల్లు ముసలితనం వల్ల మరీ అలిసిపోయినట్లు కనిపిస్తున్నాడు.

"సూడు, తల్లీ, వద్దురా అంటే వినకుండా చిన్న మద్దివాన ఎళ్ళి, మొఖ ద్వారం కాడ తంట్నే పట్టిండు. అడ సానా ప్రమాదం, తల్లీ" అన్నాడు. ఉషారాణి ప్రేమగా రామయ్య వైపు చూసింది.

"నా కెందుకు ఇది? నువ్వు తెచ్చావు కాబట్టి తీసుకుంటా" అంటూ ఆ సీసా తీసుకుంది.

"మరి నే నెవ్వళ్ళే? ఉషమ్మగారికి నేనంటే ఇష్టం." మీసం తిప్పాడు రామయ్య, భిల్లుతాతకేసి చూస్తూ.

అప్పటివరకు మౌనంగా వాళ్ళ మాటలు వింటున్న రఘురాం తెచ్చి పెట్టుకున్న నవ్వుతో — "ఓహో! మీకు ఈ హాబీ కూడా ఉన్నదా?" అన్నాడు చేపలకేసి, ఉషారాణి కేసి వింతగా చూస్తూ.

"మీ కిష్టమా? కావాలంటే మీరు తీసుకుని వెళ్ళండి."

"అదేం? కావాలని తెప్పించి, నా కిస్తున్నారు?"

"నాకెంటూ నేను ఏ వస్తువూ కోరను. పది మంది కలిసి ఆనందించేది, నాకు సొంతం చేసుకోవటం ఇష్టం ఉండదు."

ఆమె మాటలకి రఘురాం అదిరిపోయి ఏదో మాట్లాడబోయాడు.

"ఓహో! అయితే, మీకు ఇష్టమన్న మాట!" అంటూ సీసాను జాగ్రత్తగా రఘురాంకు అందించింది ఆమె.

"థాంక్యూ వెరీ మచ్. నాకు ఇవే కాదు, విశేషమున్న ఎలాంటి వస్తువయినా సరే నా దగ్గర ఉంచుకోవటం హాబీ" అన్నాడు. ఉషారాణి చేతిలోని సీసాను జాగ్రత్తగా తీసుకుంటూ, ప్రయత్న పూర్వకంగా ఆమె చేతి వేళ్ళను తాకాడు.

ఎంతో సామాన్యంగా ఆమె ఆ విషయం పట్టించుకోలేదు. తన ప్రవర్తనకు లోలోన సిగ్గుపడ్డాడు రఘురాం.

ఉషారాణి మాత్రం "చాలా సేపయిందండి, వస్తానండి" అంటూ లేచి నిలబడింది. అంతలో గుడిసెలోనుంచి బయటకు వచ్చాడు రామయ్య.

"అమ్మాయిగారూ, ఈ అయ్యగారు..." అన్నాడు అనుమానంగా.

చిన్నగా నవ్వింది తప్ప ఏం చెప్పాలో తోచలేదు ఉషారాణికి. కాని, రఘురాం మాత్రం వెంటనే— "మీ ఉషారాణిగారు నాకు మేనకోడలు వరస అవుతారులే" అంటూ, "అయినా, చూడబ్బీ, మీ అమ్మగారు నువ్వు తెచ్చిన సీసా నా కంటగట్టి తాను మాత్రం ఒక్కతే దర్జాగా వెళ్ళిపోతున్నారు" అన్నాడు.

రఘురాం నవ్వుకి, ఉషారాణి ఆశ్చర్యపోయింది.

"అయ్యగారూ, మా అమ్మాయిగారికి అలాంటి గర్వం ఉంటే మాలాంటి వాళ్ళతో మాట్లాడుతారా అయ్యా?" ఏదో చెప్పబోయిన రామయ్యకు మాట తొందరగా పెగిలి రాలేదు. ఇదే అదనుగా— "ఇక పద్నే, రామయ్యా, చీకటిపడింది. వస్తానండీ, నమస్తే!" అంటూ బయలుదేరింది.

"ఉండవారే, నేనూ వస్తున్నా" అంటూ ఆమెను అనుసరించాడు రఘురాం.

మాటలు చెప్పుకుంటూ నడుస్తున్న ఆ ఇద్దర్నీ ఒక్క క్షణం చూసి మెల్లిగా గుడిసెలోకి వెళ్ళాడు రామయ్య.

• • •

పరుగు పరుగున ఒకదానితో ఒకటి పోటీ పడి, పడుతూ లేస్తూ వస్తున్న అలలు తమ గమ్యాన్ని చేరుకోకముందే, తల్లి పిలుపు విన్న చిన్న పిల్లల్లా వెనక్కి తగ్గి వెళ్ళిపోతున్నాయి. నాడు జాబిల్లిని అందుకోవాలని తహతహలాడుతున్నట్లుగా సముద్రం ఎత్తయిన అలలతో అల్లకల్లోలంగా ఉన్నది. ఉషారాణి మనసు కూడా అలాగే ఉన్నది.

రఘురాంతో పరిచయమయిన క్షణం నుంచి రోజూ ఉషారాణి, భిల్లు, రామయ్య, రఘురాం ఎంతో ఆత్మీయుల్లా

ఎస్. ఝాన్సీరాణి

సాయంత్రంపూట కలుసుకొని మాట్లాడుకొనే వారు.

అప్పుడప్పుడూ భిల్లు తాత ఉషా రఘురాముల గూర్చి మరీ సన్నిహితంగా మాట్లాడేవాడు. అదేమీ పట్టించుకునేది కాదు ఉష. ఉషారాణి లాంటి వారంటే తన కిష్టమున్నట్లుగా ఎన్నో సార్లు మాట్లాడాడు రఘురాం. కాని, అవన్నీ స్నేహపూర్వకంగా అనుకునేది ఉషారాణి.

అనుకున్నది ఒకటి, అయినది మరొకటి. భిల్లు, రామయ్యలు వేట కెళ్ళారు. వాళ్ళు లేని కారణంగా ఎంతో విచారంగా ఉన్న ఉష, రఘురాం తోడుగా వచ్చి నందుకు కొద్దిగా సంతోషం పొందింది. ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడే రఘురాం ఆ రోజు చాలా మౌనంగా ఏదో ఆలోచిస్తున్నట్లుగా కూర్చున్నాడు. ఎప్పుడూ చొరవతీసుకొని ఉషారాణి పరిచయమున్న వ్యక్తిగదా అని 'ఏమిటి, అలా ఉన్నారు?' అన్నది.

కాని, ఆమె కళ్ళలోకి తీక్ష్ణంగా చూస్తూ ఉండిపోయాడు రఘురాం. ఉష తల వంచుకుంది.

"ఔను, నా మనస్సేమీ బాగాలేదు. మిమ్మల్ని ఒక్క మాట అడగనా?" హఠాత్తుగా అతను అలా అడగటంతో ఆశ్చర్యపోయింది. కాని, మర్యాదకోసం—

"భలేవారండి, ఒక్క మాట అడగటానికి పర్మిషన్ కావాలంటండీ! ఒక్క మాట ఏం ఖర్మ? పది మాట లడగండి" అంటూ సముద్రంకేసి చూసి, "చీకటి పడింది. పాపం, భిల్లుతాత, రామయ్య ఇంకా రాలేదు. నా కేమిటో భయంగా ఉంది" అంది.

"వాళ్ళ కది అలవాటే కదండి? చేప పిల్లకి ఈత నేర్పాలా! భయం దేనికి?" అన్నాడు.

కాని, ఉష మాత్రం సముద్రం వంక చూస్తూ ఉండిపోయింది. ఆమె మౌనాన్ని భరించలేనట్లుగా రఘురాం— "ఉషారాణీ, మీ అందం, గుణం నా కెంతో నచ్చాయి. అందరిలా ఆస్తులని ప్రేమించేవాడిని కాదు నేను. అందుకే ధైర్యంగా మిమ్మల్ని అడుగుతున్నా. మాటిగా చెప్పండి. నన్ను ... నన్ను మీరు పెండ్లి చేసుకోగలరా? మీ కిష్టమేనా?"

ఏదో జవాబు చెప్పబోయిన ఉషారాణి "కెవ్వు" మంది.

ఎప్పటినుంచో వారి మీద దొంగ చాటుగా దెబ్బతీయాలని చూస్తున్న పెద్ద అల వాళ్ళని తడిపేసింది. సిగ్గుగా తల వంచుకుంది ఉషారాణి. ఆమె మౌనం అంగీకార మనుకున్నాడు అతను.

"చాలా సంతోషం, ఉషా. నాకు ఉన్న గౌరవం, మర్యాద, ఆస్తి ఈ రోజునుంచి పదిరెట్లు పెరిగినట్లుగా ఉంది. మీ సముద్ర స్నేహితులు కూడా తన అలల చేతులతో నిన్ను, నన్ను దీవించారు."

సంతోషంగా ఉషారాణి చేతులు పట్టుకుని ముద్దు పెట్టుకున్నాడు. ఆమె స్పర్శతో— "అయ్యో! పూర్తిగా తడిసి పోయావు. జలుబు చేస్తుంది. త్వరగా ఇంటికి వెళ్ళు" అన్నాడు. సిగ్గుగా తన చేతులు అతని చేతుల్లో నుంచి విడిపించుకుంటూ, "మరేం ఫరవాలేదు. మీరు నేనెన్నిసార్లు పిలిచినా మా ఇంటికి రాలేదు. ఎందుకో తెలుసుకోవచ్చా?" అంది.

"నన్ను మరోలా అనుకోనంటే నిజం చెబుతాను. ఆడంబరాలకోసం ఆరాటపడి, ఇళ్ళలో మనం పొందబోయే దేమిటో నాకు బాగా తెలుసు. పైగా పిలిచిన వాళ్ళ పరువు ఉండదు." పెదవులపై మాటగా అన్నాడు రఘురాం.

అతని మాటలు ఎంతో నిజమనిపించాయి ఆమెకు. కాని, ఎందుకో భయం వేసింది. తల వంచుకొని మెల్లిగా అంది: "నాకుమాత్రం అమ్మ, నాన్నలు ఇష్టపడిన సంబంధం చేసుకోవాలని ఉంది."

గలగలా నవ్వి మెల్లగా విషయం బయట పెట్టాడు రఘురాం.

"ఉషా, నువ్వు నిజంగా ఇంత అమాయకురాలి వనుకో లేదు. నేను మీవాళ్ళు అందరితో ఎప్పుడో మాట్లాడాను. నే నెవర్నో తెలుసా? కోటికి పడగెత్తిన గోవిందపాణి గారి కనిష్ఠ పుత్రుడిని. ఓ! చాలా టైమ్ అయింది. త్వరగా మా అమ్మకు ఈ శుభ వార్త చెప్పాలి" అంటూ ఉషారాణికి "బై బై" చెబుతూ పరుగులాంటి నడకతో బయలుదేరాడు.

"మీరు ... మీరు ... గోవింద పాణి గారి ..."

ఉషారాణి మాటలు పెదవి దాటి రాలేదు. కాని, రఘురాం మాత్రం అక్కడి బీచీ రోడ్డు దాటేశాడు. అలా ఎంతసేపు కూర్చుందో ఆమెకే తెలియదు.

'డబ్బున్న వాళ్ళు డబ్బున్నవాళ్ళకే డబ్బు పంచాలా? ఒక సామాన్యుడి జీవితం అతనికి రాబోయే కట్నపు డబ్బుతో ఎందుకు బాగుచేయకూడదు? గోవింద పాణి పేదవాళ్ళ నోళ్ళు కొట్టి అక్రమ వ్యాపారంలో కోట్లు సంపాదించాడు. అతనికి తను కోడలు—ఛీ ... ఛీ ... కాని, అలా అని తను నమ్మిన రఘురాం...'

ఆమె ఆలోచనలు అక్కడ ఉన్న ఇసుక రేణువులకన్నా ఎక్కువవుతున్నాయి.

• • •

ఆ వేళ ఉషారాణి ప్రమేయం లేకుండా అన్ని పనులు జరిగిపోయాయి. పెండ్లి నిశ్చితార్థం జరిగింది.

సాయంత్ర మయింది. భిల్లు తాత వాళ్ళ గుడిసె దగ్గరకు వచ్చింది. గుడిసె తడికె తీసి ఉంది. లోపలకు అడుగు పెట్టింది. చింకి చాప మీద పడుకొని ఉన్నాడు తాత. చినిగిన పంచెలు కట్టుకుంటున్నాడు రామయ్య. అలికిడి విని చేస్తున్న పనిని ఆపి ఉషారాణిని చూచి, "ఏమి టమ్మాయిగారూ, ఈయాల పెండలాడే వచ్చారు" అన్నాడు రామయ్య.

మరో మాటకు అవకాశ మివ్వకుండా పెద్ద రాయి ఒకటి ముందుకు లాగి, "కూకోండి" అన్నాడు.

"మనుండి వచ్చాను" అన్నది.

"కాకితో కబురెట్టినా నే వద్దునే!"

"రామయ్యా, నే నంటే నీ కిష్టమేనా?"

అర్థం లేదు ఆ ప్రశ్నకి.సందర్భం లేని ప్రశ్న అది. కాని తెలివిగా. "మిమ్మల్ని ఇష్ట పడనోళ్ళు అంతా యములోళ్ళే" అన్నాడు.

"అయితే, చూడు, నీ కిష్టమయితే నన్ను పెండ్లిచేసుకో. ఈ డబ్బు, నగలతో మనం ఏ దేశంలో అయినా కాలు కింద పెట్టకుండా నదేళ్ళు బర్వాగా బది తిరగవచ్చు." ఆవేశంగా బాగ్ తెరచి చూపిస్తూ అన్నది ఉషారాణి.

పొంగుతున్న పాలల్లోకి నీళ్ళు జల్లినట్లుగా—"మీ పెద్దోరితో ఇదేనండి గోల. ఏందో ఏందో అంటూ ఏందో సేస్తారు. మాకు సుఖం ఇవ్వాలని ఆ సముద్ర దేవుడికి దండం పెడుతున్నా, డబ్బులో ఎన్నాళ్ళు ఉంటాది సుఖం? మంచి పేరు ఉండాలి గాని! మీ డబ్బు, నగలు చూసి మీ ఎంట పడితే... అయ్యోరాత! అయినట్లే. మీకింకా పెపంచకం తెలవదు. లెగండి, ఉన్నదానితో తురుపితి పడ్డాడో మడిసి. ఉషమ్మగోరూ, మీకోసం ఏదయినా చేస్తాగాని మీకు చెడ్డపేరు నా కిట్టం లేదు" అన్నాడు.

ఎప్పుడు లేచాడో భిల్లు తాత— "అమ్మాయిగోరూ, వాడు పుట్టుగుడ్డి అయిన వాడి మేనకోడల్ని చేసుకోబోతుండు. మరి ఈడు ఆదుకోబోతె దాని గతేం గాను?" అన్నాడు.

ఉషారాణి రెండు కళ్ళు నిండిన చెరువుల్లా ఉన్నాయి. ఏడుపు దిగమింగుకుంటూ, "తాతా, రామయ్యా, నన్ను క్షమించండి" అంటూ వెళ్ళబోతున్న ఆమెను ఒక్క క్షణం ఆగమన్నాడు భిల్లు. వణుకుతున్న చేతులతో పాయి పక్కగా ఉన్న కంతలో మంచి పెద్ద ముత్యం తెచ్చి ఆమె చేతిలో పెడుతూ, "రామయ్య మీకోసం తెచ్చాడు" అన్నాడు.

"మంచి ముత్యం!" ఆశ్చర్యంగా చూస్తూ అన్నది ఉషారాణి.

"అవును, తల్లీ. ముత్యం లాంటి మీకు ఈ మంచి ముత్యం వాడి పెండ్లి కానుక" అంటూ దీవించాడు భిల్లుతాత.

ఉషారాణి వంక, ముత్యం వంక ప్రేమగా, గర్వంగా చూశాడు రామయ్య

రామయ్య వంక ఒక్కసారి చూచి మంచి ముత్యం గుప్పెటలో పెట్టుకుని వెళ్ళిపోయింది ఉషారాణి. ★

